



PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు


సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.


| | | | | | |
|---|---|---|---|---|---|
| శుక్రవారం 14 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక :73 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |





## మైనారిటీ యువత నైపుణ్యాలతో తెలంగాణ రైజింగ్‌కు కృషి చేయాలి: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: హిందూ, ముస్లింల మధ్య తనకు ఎలాంటి వ్యత్యాసం లేదని, హిందూ–ముస్లింలు ఇద్దరూ తనకు రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులైన అభ్యర్థులు తెలంగాణ రైజింగ్ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని, గ్రూప్–1, 2, 3, 4 తదితర ఉద్యోగ నియామకాల్లో ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 782 మంది మైనారిటీ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ చదువొక్కటే భవిష్యత్తును మార్చగలదని, నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యపై దృష్టి సారించిన అనంతరం విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నైపుణ్యాలు ఉన్నవారికి దేశంలోనే కాకుండా జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోనూ అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. యువతను నైపుణ్యాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చామని, పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకొచ్చామని చెప్పారు. కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన చిన్న కుటుంబాలకు చెందిన యువతను ముఖ్యమంత్రి అభినందించారు. మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి విజయవంతం కాలేదని, సంక్షేమ కార్యక్రమాల్లో మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన ప్రయోజనం కలుగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్–1తో పాటు ఉద్యోగ నియామకాలు సక్రమంగా జరగలేదని, గతంలో పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాలు చోటుచేసుకున్నాయని విమర్శించారు. గ్రూప్–1, గ్రూప్–2 వంటి పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత, నైపుణ్యం కలిగిన సభ్యులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్‌తో పాటు నిపుణులతో సమాలోచనలు జరిపి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశామని తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు, అడ్డంకులు ఎదురైనప్పటికీ అభ్యర్థులను తమ కుటుంబ సభ్యులుగా భావించి హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసి నియామక ప్రక్రియను పూర్తి చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం: మంత్రి పొంగులేటి

కూకట్‌పల్లి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: వచ్చే ఏడాది కూకట్‌పల్లిలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం నిర్వహించిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం కమిషన్లు వచ్చే పనులపై దృష్టి పెట్టి పేదలకు ఇళ్లు నిర్మించలేదని, ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మాత్రం హైదరాబాద్ మహానగరంలో ఎకరా భూమి రూ.200 కోట్ల వరకు విలువ ఉన్నప్పటికీ పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలనే నిర్ణయాన్ని ఆచరణలోకి తీసుకువచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని, అవసరమైతే తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇళ్ల నిర్మాణాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని చెప్పారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించిందని, ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తుల స్వీకరణ గడువు ముగుస్తుందని తెలిపారు. అనంతరం ఎలాంటి లాలూచీలు, సిఫార్సులకు తావులేకుండా మంత్రుల సిఫార్సులు కూడా పరిగణనలోకి తీసుకోకుండా అందరి సమక్షంలో లక్కీ డిప్ ద్వారా ఇళ్లను పారదర్శకంగా కేటాయిస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ముందుగానే ఇళ్ల వివరాలను అందిస్తామని, వారు నిర్మాణ సమయంలో దగ్గరుండి కాంట్రాక్టర్‌తో నాణ్యమైన ఇళ్లను నిర్మించుకునే అవకాశం ఉంటుందని సూచించారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక తమ ప్రభుత్వంపై కక్షపూరిత ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తుచేసిన మంత్రి, గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే తమ ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో మూడు రెట్లు ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, ఆ లక్ష్యాన్ని సాధించకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి ప్రకటించారు. గతంలో తాను విసిరిన సవాల్‌ను ప్రతిపక్ష నాయకులు స్వీకరించలేదని, ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని అన్నారు. పేదలను, పేదల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా అవాస్తవాలు, ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్న విషయాన్ని శాసనసభ్యులు తన దృష్టికి తీసుకువచ్చారని, అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే వాటిపై ఉన్న నిషేధాన్ని తొలగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు.

## 22-ఏ భూముల హక్కుదారులు ఆందోళన చెందొద్దు: సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: నిషేధిత జాబితా (22-ఏ)లో ఉన్న భూములకు సంబంధించి హక్కుదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. నిషేధిత జాబితాలో చేరిన భూముల సర్వే నంబర్లకు బై-నంబర్లు ఇచ్చి హక్కుదారుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు (టవర్స్) నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రజలతో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏదైనా కారణంగా భూమి 22-ఏ నిషేధిత జాబితాలో చేరి ఉంటే కొనుగోలు చేసిన హక్కుదారుల స్థలాలు ఎక్కడికీ పోవని స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన సర్వే నంబర్లలోని మొత్తం భూములను నిషేధిత జాబితాలో చేర్చినట్లు, కోర్టు కేసులు ఉన్న స్థలాలను పక్కనపెట్టి మిగిలిన భూములకు బై-నంబర్లు ఇచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కూకట్‌పల్లి ప్రాంత అభివృద్ధికి అవసరమైన రోడ్లు, ఫ్లైఓవర్లు, చెరువుల పునరుద్ధరణ, పాఠశాలలు, కళాశాలలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం అవసరమైన పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై గత పాలనను, ప్రస్తుత రెండేళ్ల పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల్లో ఏ ఒక్కదానినీ నిలిపివేయలేదని, అదనంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. రాష్ట్రంలోని 3.28 కోట్ల మంది ప్రజలకు ప్రతి వ్యక్తికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశామని, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ద్వారా ఉద్యోగం, ఉపాధి, విద్య కోసం ప్రయాణించే మహిళలు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీకి ఇప్పటికే రూ.12 వేల కోట్లు చెల్లించామని, స్వయం సహాయక సంఘాలకు రూ.65 వేల కోట్ల బ్యాంకు లింకేజీ కల్పించి రూ.2,500 కోట్ల వడ్డీ చెల్లించామని వివరించారు. మహిళా సంఘాల పేరిట వెయ్యి బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చామని, వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశం కల్పించామని తెలిపారు. ఆదిలాబాద్ అడవుల నుంచి అచ్చంపేట వరకు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో మూడున్నర ఎకరాల్లో ఇందిరా మహిళా బజార్ల ఏర్పాటుకు విలువైన స్థలాన్ని కేటాయించామని చెప్పారు. రెండేళ్లు పూర్తయ్యేలోపు ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని పేర్కొన్నారు. కూకట్‌పల్లిలో వందల కోట్ల విలువైన 11 ఎకరాల భూమిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, నగరంలో నిరుపేదలు ఎక్కడ నివసిస్తున్నారో అక్కడే వారికి ఇళ్లు ఇవ్వాలన్నది ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. పేదల కోసం నిర్మించే ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా రద్దు చేయాలని మంత్రులకు సూచించారు. నిర్మించే ఇళ్లకు స్థలాన్ని పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని, నిర్మాణ వ్యయంలో రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధిదారులు భరిస్తే నిర్మాణ ప్రక్రియలో తమ ఇంటిని ఎప్పటికప్పుడు పరిశీలించే హక్కు వారికి ఉంటుందని వివరించారు. నిరుపేదలకు సొంత ఇళ్లు అందించి వారి సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నూటికి నూరు శాతం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. మొదటి విడతలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, కంటోన్మెంట్, ఎల్బీనగర్, ఉప్పల్ వంటి అత్యధికంగా పేదలు నివసించే ప్రాంతాలతో పాటు ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి ఉపాధి కోసం నగరానికి వలస వచ్చిన వారికి కూడా మంచి ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గతంలో ప్రజలు ఏదైనా పని కోసం గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ప్రజల సౌకర్యం కోసం సైబరాబాద్ కమిషనరేట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల అభివృద్ధి కోసం తాను అండగా నిలుస్తానని, పది మందికి మేలు చేయాలనే ఆలోచనతో పనిచేస్తున్నానని, మంచి చేయడానికి చిత్తశుద్ధి, మంచి ఆలోచన అవసరమని అన్నారు. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించేందుకు రోజుకు 18 గంటలు పనిచేసే శక్తిని దేవుడు తనకు ఇచ్చారని, రాష్ట్ర అభివృద్ధికి ప్రజలు ఆశీర్వదించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.



## ప్రజా సమస్యలపై వెనక్కి తగ్గేది లేదు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని, తమ సంయమనాన్ని బలహీనతగా భావించవద్దని హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనానికి నష్టం కలిగించే విధంగా అక్రమాలకు పాల్పడుతున్న వారిపై పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. రైతులు, నిరుద్యోగులు, పేదల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రశ్నిస్తామని తెలిపారు. ప్రజల ప్రయోజనాల విషయంలో అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వంపై ఆయన చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.



## ఆర్డీఎస్ కుడికాల్వ పనులపై ట్రిబ్యునల్ ఆగ్రహం.. నిబంధనలు పాటించాలని స్పష్టం

తుంగభద్ర | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నదిపై ఉన్న రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఆనకట్టను కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్–2 సభ్యులు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఎస్ కుడికాల్వ నిర్మాణ పనులు, ఆనకట్ట బలోపేతం, మరమ్మతులు, నీటి నిల్వ సామర్థ్యానికి సంబంధించిన అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించారు. కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్–2 అవార్డు అమలులోకి రాకముందే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడికాల్వ పనులను చేపట్టడం నిబంధనలకు అనుగుణంగా లేదని ట్రిబ్యునల్ సభ్యులు అభిప్రాయపడినట్లు సమాచారం. ఆనకట్టలోని ఐదు రేడియల్ గేట్లలో ఒక గేటును తొలగించే ప్రతిపాదనపై కూడా వారు అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అన్ని గేట్లను 1089 అడుగుల స్థాయిలో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సూచించినట్లు తెలిసింది. ఆనకట్ట ఎత్తును పెంచి బలోపేతం చేసే పనులకు అడ్డంకులు ఎందుకు ఏర్పడ్డాయని అధికారులు ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ఆనకట్ట ఎత్తు పెంపునకు సంబంధించి ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయినప్పటికీ పనులు ఎందుకు ముందుకు సాగలేదని అధికారులను నిలదీసినట్లు సమాచారం. ఆనకట్టలో మట్టి, ఇసుక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యంపై కూడా ట్రిబ్యునల్ సభ్యులు ఆరా తీశారు. ఇదే సమయంలో ప్యాకేజీ–1 పనులు 2018 నుంచి ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని కర్ణాటక అధికారులను ప్రశ్నించారు. ఆనకట్ట మరమ్మతులు, బలోపేతం వంటి పనులకు సంబంధించి ఏపీ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంపై కూడా ట్రిబ్యునల్ సభ్యులు ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. పెండింగ్‌లో ఉన్న ప్యాకేజీ–1, ప్యాకేజీ–2 పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిసింది.




## మహారాష్ట్రకు తరలిస్తున్న 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్

నర్సాపూర్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నే పోచయ్య | ఆగస్టు 14: నర్సాపూర్ పట్టణంలో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న సుమారు 350 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారంతో హైదరాబాద్ నుంచి మహారాష్ట్రలోని గోండియా ప్రాంతానికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీలను నర్సాపూర్ బస్ డిపో సమీపంలో పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పౌరసరఫరాల శాఖ అధికారులు లారీలను తనిఖీ చేసి బియ్యానికి సంబంధించిన వివరాలను సేకరించారు. సుమారు 350 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించిన అధికారులు బియ్యాన్ని స్వాధీనం చేసుకుని లింగాపూర్‌లోని రైస్ మిల్లులో భద్రపరిచారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై సంబంధిత అధికారులు తదుపరి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.




## నాల్సార్ విద్యార్థుల బార్ నమోదు నిషేధం ఉపసంహరణ

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ (నాల్సార్) 2026 బ్యాచ్ విద్యార్థుల బార్ కౌన్సిల్ నమోదుపై విధించిన నిషేధాన్ని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఉపసంహరించుకుంది. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌కు వ్యతిరేకంగా కొందరు విద్యార్థులు ప్రచారం నిర్వహించిన నేపథ్యంలో నాల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థుల నమోదు ప్రక్రియపై బీసీఐ ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అయితే కొంతమంది విద్యార్థులు చేసిన చర్యలకు మొత్తం బ్యాచ్‌ను బాధ్యులను చేసి శిక్షించడం సముచితం కాదనే అభిప్రాయంతో గత నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు బీసీఐ డైరెక్టర్ మనన్ కుమార్ మిశ్రా ప్రకటించినట్లు సమాచారం. తాజా నిర్ణయం ప్రకారం నాల్సార్ విద్యార్థులు తమకు నచ్చిన రాష్ట్రంలోని సంబంధిత బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా తమ పేర్లను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. అదే సమయంలో జస్టిస్ సూర్యకాంత్‌కు వ్యతిరేకంగా ప్రచారంలో పాల్గొన్న విద్యార్థులు, వారిని ప్రోత్సహించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుల వివరాలతో సమగ్ర నివేదికను సమర్పించాలని నాల్సార్ యాజమాన్యాన్ని బీసీఐ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై యూనివర్సిటీ నుంచి వచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి.



## రెడ్డిపల్లెలో జీపీడీపీ తుది గ్రామ సభ

నర్సాపూర్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నే పోచయ్య | ఆగస్టు 14: నర్సాపూర్ మండలం రెడ్డిపల్లె గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) 2026–27 తుది గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుడ్డి పద్మావతి అశోక్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి బుద్దా వెంకటేష్, ఉపసర్పంచ్ నక్క ఇందిర, వార్డు సభ్యులు భూదేవి, నాగ శ్రీ, మహేష్ గౌడ్, అంగన్‌వాడీ టీచర్ హేమలత, ఆశా కార్యకర్త జ్యోతి, జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు సుందర్, ఏఎన్‌ఎం విజయతో పాటు గ్రామ ప్రజలు, యువజన సంఘాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీపీడీపీ 2026–27 ప్రణాళికలో భాగంగా గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమాన్ని నిర్ణయించారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు వంటి మౌలిక వసతులపై చర్చించారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధి, పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, ఆరోగ్య సేవలను బలోపేతం చేయడం, సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక, గ్రామ పరిశుభ్రత, చెత్త సేకరణ, పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాభివృద్ధిలో యువత భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రణాళికలో ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ సభలో నిర్ణయించారు. గ్రామ ప్రజల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి ప్రణాళికను రూపొందించి అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అరెస్ట్ కాలేదు: డీసీపీ శిల్పవల్లి




హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: పినపాక నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును పోలీసులు అరెస్ట్ చేశారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పవల్లి ఖండించారు. లైంగిక ఆరోపణలకు సంబంధించిన కేసు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైందని, ప్రస్తుతం ఆ కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. అయితే ఇప్పటివరకు రేగా కాంతారావును అరెస్ట్ చేయలేదని డీసీపీ స్పష్టం చేశారు. ఆయన అరెస్ట్‌కు సంబంధించి సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని, అధికారికంగా ధృవీకరించని సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం సరికాదని డీసీపీ శిల్పవల్లి పేర్కొన్నారు.



## బీడీ కార్మికులకు కొత్త జీవన భృతి కోసం దరఖాస్తులు స్వీకరించాలి: సీఐటీయూ

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: బీడీ కార్మికులకు జీవన భృతి మంజూరు చేసేందుకు అర్హులైన వారి నుంచి కొత్తగా దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ బీడీ కార్మికుల జీవన భృతికి సంబంధించి కొత్త దరఖాస్తులు తీసుకోవడం లేదని ఆరోపించారు. దీంతో అర్హత ఉన్న బీడీ కార్మికులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. మెదక్ జిల్లా, ముఖ్యంగా మెదక్ నియోజకవర్గ పరిధిలో బీడీ పరిశ్రమ మహిళలకు ప్రధాన ఉపాధి వనరుగా ఉందని, కేంద్ర ప్రభుత్వ విధానాల ప్రభావంతో బీడీ పరిశ్రమ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నెలకు రూ.2,000 జీవన భృతి బీడీ కార్మికులకు కొంతమేర ఆర్థిక భరోసాగా ఉందని, 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఈ మొత్తాన్ని పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం ఉన్న జీవన భృతిని పెంచకపోవడంతో పాటు కొత్తగా అర్హులైన కార్మికులకు పింఛన్లు మంజూరు చేయడం లేదని విమర్శించారు. అర్హులైన ప్రతి బీడీ కార్మికుడి నుంచి కొత్త జీవన భృతి కోసం దరఖాస్తులు స్వీకరించి, నెలకు రూ.4,000 చొప్పున జీవన భృతి అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మల్లేశం హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బాలమణి, బీడీ కార్మికులు నర్సవ్వ, నాగమణి, పూజ, రజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



## జనాభా లెక్కలతోనే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: జిల్లా జనాభా లెక్కల ఆధారంగానే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధిని సాధించవచ్చని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా రూపొందిస్తున్న జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ అత్యంత ప్రామాణికమైన సమాచార వనరుగా ఉండాలని సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులతో జిల్లా జనాభా లెక్కల హ్యాండ్‌బుక్ తయారీపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను రూపొందించడంలో జనాభా లెక్కలు కీలకంగా ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి రంగానికి సంబంధించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ధ్రువీకరించి, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జనగణన 2027 సన్నాహకాల్లో భాగంగా మున్సిపల్, విద్య, వైద్యారోగ్యం, గృహ నిర్మాణం, రోడ్లు–భవనాలు తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల వారీగా జనాభా వివరాలను నమోదు చేయడంతో పాటు మౌలిక వసతులు, విద్య, వైద్యం, పౌర సౌకర్యాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. డిజిటల్ దరఖాస్తులు, వెబ్ పోర్టల్ల ద్వారా సేకరించిన సమాచారాన్ని కచ్చితత్వంతో క్రోడీకరించాలని, రెవెన్యూ గ్రామాల స్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. జనాభా లెక్కల సమాచారంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఈ గూగుల్ మీట్ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు రమాదేవి, రామకృష్ణ, బసయ్య, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వట్పల్లిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

వట్పల్లి | సందేశం టైమ్స్ ప్రతినిధి సిహెచ్ బస్వరాజ్ | ఆగస్టు 14: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ వట్పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో, శాంతినికేతన్, అక్షర, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు దేశభక్తి నినాదాలు చేస్తూ స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు సురేష్ గౌడ్, జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షుడు అరవింద్ పాటిల్, మండల ఇన్‌చార్జి భూమయ్య, జీఎస్ యాదయ్య, ఉపాధ్యక్షులు యాదగౌడ్, వెంకట్రావు, రాజశేఖర్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పాండు, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షుడు సంగమేశ్వర్, మండల సామాజిక మాధ్యమాల కన్వీనర్ శశిధర్, నాగరాజు, గోపాల్, విఠల్ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. దేశ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎన్నికల హామీల అమలుకు గీత కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: గౌడ, కల్లుగీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గీత కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 2 నుంచి 18 వరకు అమరుల యాదిలో నిర్వహిస్తున్న గీతన్నల చైతన్య బస్సు యాత్రలో భాగంగా మెదక్ పట్టణానికి చేరుకున్న యాత్ర బృందానికి సీపీఎం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం ఘన స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా యాత్ర నాయకులు మాట్లాడుతూ గౌడ సంక్షేమం, కల్లుగీత కార్మికుల ఉపాధి కోసం బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. గీత కార్మికుల పింఛన్‌ను నెలకు రూ.4 వేలకు పెంచుతామని, వృత్తిలో ప్రమాదాలకు గురై మృతి చెందిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని, నెల రోజుల్లోనే పరిహారం చెల్లిస్తామని ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. వృత్తిలో ప్రమాదాలకు సంబంధించిన ఎక్స్‌గ్రేషియా కోసం సుమారు రూ.20 కోట్ల బకాయిలు ఉన్నాయని, ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నప్పటికీ వాటిని చెల్లించలేదని ఆరోపించారు. 50 సంవత్సరాలు నిండిన గీత కార్మికులకు పింఛన్ అందించేందుకు జీవో ఉన్నప్పటికీ కొత్తగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం లేదని తెలిపారు. తాము కొత్తగా ఎలాంటి డిమాండ్లు చేయడం లేదని, ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే అమలు చేయాలని కోరారు. వృత్తిలో ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచాన్ని అర్హులైన ప్రతి గీత కార్మికుడికి అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సభ్యత్వం కలిగిన గీత కార్మికులు సుమారు 2.30 లక్షల మంది ఉండగా కేవలం 30 వేల మందికి మాత్రమే రక్షణ కవచాలు అందాయని, మిగిలిన వారికి వెంటనే అందించాలని కోరారు. తాటి, ఈత చెట్ల పెంపకానికి ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల చొప్పున భూమి కేటాయించాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలని, నందనంలోని నీరా ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నీరా కోసం బడ్జెట్‌లో కేటాయించిన రూ.25 కోట్లు, గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన రూ.67 కోట్లను వెంటనే విడుదల చేసి వినియోగించాలని కోరారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే చైతన్య బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 18లోగా సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాత్ర బృందం సభ్యులు, సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, బూడిద గోపి, సంఘం సీనియర్ నాయకులు భీమగోని చంద్రయ్య, కుర్ర ఉప్పలయ్య, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మల్ల గౌడ్, ప్రధాన కార్యదర్శి లచ్చ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. మల్లేశం తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆస్పత్రిలో చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. ఆగస్టు 13 నుంచి ఈ ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు ముందస్తుగా అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన అవసరం లేదని, నిమ్స్ పాత భవనంలోని 32వ గదిలో నేరుగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదు, తదుపరి వైద్య ప్రక్రియకు సంబంధించిన వివరాల కోసం ఆస్పత్రి మొదటి అంతస్తులోని సీటీ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. అర్హత కలిగిన చిన్నారులకు ఉచితంగా అందిస్తున్న ఈ వైద్య సేవలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు అవసరమైన చికిత్స అందించాలని నిమ్స్ అధికారులు కోరారు.



## అనిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

చౌటకూరు | సందేశం టైమ్స్ ప్రతినిధి వి. వెంకటేశం | ఆగస్టు 14: సంగారెడ్డి జిల్లా చౌటకూరు మండలం బద్రిగూడెం గ్రామానికి చెందిన గర్భిణి అనిత సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనతో ఆమె కుటుంబంలో విషాదం నెలకొంది. అనిత మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆందోల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ బద్రిగూడెం గ్రామానికి వెళ్లి అనిత భర్త శ్రీశైలం, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. అనిత మృతిపై ఆయన సంతాపం వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, న్యాయం జరిగేలా తమ వంతు సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు పట్లోళ్ల జైపాల్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. బద్రిగూడెం గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొని అనిత మృతికి సంతాపం తెలిపారు.

## మిషన్ భగీరథ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: యూనియన్


మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్

తేది: 13.08.2026

డిమాండ్స్

1 మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం రూ။26000/-లు ఇవ్వాలి.
2 కార్మికులందరికి పిఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ కార్డు ఇవ్వాలి.
3 ప్రతి నెల 7వ తేదిలోపు జీతాలు ఇవ్వాలి.
5 కార్మికులందరికి యూనిఫాం, షూ ఇతర సౌకర్యాలు కల్పించాలి.
6. కార్మికునికి విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన వారి కుటుంబానికి 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.
7. ప్రతి కార్మికునికి ప్రతి నెల ఫోన్, పెట్రోల్ అలవెన్స్ 5000/-లు ఇవ్వాలి.

అభివందనలతో

సంగారెడ్డి | సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | ఆగస్టు 14: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ మిషన్ భగీరథ కార్మికుల యూనియన్ నాయకులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ అధ్యక్షుడు, సభ్యులు కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి కార్మికుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ పథకం అమలులో కీలకంగా పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారులు సమగ్రంగా పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు, సభ్యులు, మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.



## పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీల కూలి పెంచాలి: సీఐటీయూ

కోదాడ | సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 14: నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో హమాలీ కార్మికుల రోజువారీ కూలీకి అనుగుణంగా ఎగుమతి, దిగుమతి రేట్లను పెంచుకోవాల్సిన అవసరం ఉందని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు మిట్టగనుపుల ముత్యాలు అన్నారు. కోదాడ పట్టణంలోని గుడిబండ రోడ్డులోని ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద ఎరువుల బస్తాల ఎగుమతి, దిగుమతి రేట్ల అగ్రిమెంట్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని, దీనికి అనుగుణంగా కార్మికులకు లభించే కూలీ మాత్రం సరిపోవడం లేదని అన్నారు. కార్మికుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎరువుల బస్తాల ఎగుమతి, దిగుమతి రేట్లను గతంలో ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం 19 శాతం పెంచుకున్నట్లు తెలిపారు. హమాలీ కార్మికులు కష్టపడి పనిచేస్తున్నప్పటికీ సొంత ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేక పట్టణాలకు వలస వచ్చి అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన హమాలీ కార్మికులను ప్రభుత్వం గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వాలు నియంత్రించి సామాన్యులు, కార్మికులపై ఆర్థిక భారం తగ్గించాలని కోరారు. రేట్ల పెంపుపై చర్చలకు వచ్చిన యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అండగా ఉంటుందని ముత్యాలు అన్నారు. కార్యక్రమంలో కొత్తూరు పూర్ణయ్య, ఓరుగంటి వెంకన్న, శ్రీనయ్య, రెడ్డి రంగారావు, కార్మికులు వి. రాముడు, ఎం. రామారావు, వీరయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.





## జోగిపేటలో భారీ జాతీయ జెండాతో ఘనంగా తిరంగా యాత్ర

జోగిపేట | సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం | ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. సుమారు పది మీటర్ల పొడవైన జాతీయ జెండాను చేతబట్టి బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేశభక్తి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ ప్రజలందరూ దేశభక్తితో దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తూ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, ఆందోల్ మండల బీజేపీ ఇన్‌చార్జ్ పెరుమాండ్ల పవన్ కుమార్ హాజరయ్యారు. ఆందోల్ నియోజకవర్గ కో-కన్వీనర్ మహేష్కర్ సుమన్, మాజీ ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ ప్రభాత్, ప్రధాన కార్యదర్శి మ్యాదరి పాపయ్య, ఆందోల్ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గౌండ్ల కార్తిక్ గౌడ్, టేక్మాల్ ప్రవీణ్, అప్పకోర్పోలు గ్రామ ఉపసర్పంచ్, ప్రవీణ్ రెడ్డి బచ్చుగూడెం, రాంసాన్‌పల్లి మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి, రోళ్లపాడు మాజీ సర్పంచ్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీనాథ్ పగిడిమర్రి, బంగ్లా సాయికుమార్, బేగరి మాణిక్యం, ప్రశాంత్ జోగిపేట, సాయిరాం దర్జీ, గుండెగల నరసింహులు, హరీష్, గణేష్, నరేష్, సాయికుమార్, వినీత్, నాగరాజుతో పాటు బీజేపీ నాయకులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తిరంగా యాత్రను విజయవంతం చేశారు.



## మెదక్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మెదక్ జిల్లా కేంద్రంలో ఆగస్టు 15, 2026న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించడంతో పాటు జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, జిల్లాలో సాధించిన పురోగతిని ప్రతిబింబించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, సాధించిన పురోగతికి సంబంధించిన సమగ్ర సమాచారంతో ముఖ్య అతిథి ప్రసంగానికి నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు, విద్యార్థులు, యువతతో పాటు జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ కోరారు.



# బాలికను ప్రేమ పేరుతో వేధించిన నిందితుడికి రెండేళ్ల జైలు

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమ పేరుతో వెంటపడి వేధించిన కేసులో నిందితుడికి జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం నరేష్ (27) అనే వ్యక్తి పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించాలంటూ వెంటపడుతూ వేధింపులకు గురిచేయడంతో కుటుంబ సభ్యులు వెల్దుర్తి పోలీసులను ఆశ్రయించారు. దీంతో వెల్దుర్తి ఎస్ఐ మధుసూదన్ గౌడ్ 2022 జూలైలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో కీలకమైన సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు సమర్పించారు. కేసు విచారణ సమయంలో ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించగా, లీగల్ అడ్వైజర్ శ్వేత బాధిత బాలిక సాక్ష్యం ఇచ్చే ప్రక్రియలో సహకరించారు. పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన జిల్లా ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావాలి నిందితుడు నరేష్‌కు రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు. కేసు దర్యాప్తు, విచారణలో లైజనింగ్ అధికారులు ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణగౌడ్, సీడీఓ ప్రవీణ్ సహకరించారని పేర్కొన్నారు. బాలికలు, మహిళలను వేధించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. వేధింపులకు గురయ్యే బాధితులు భయపడకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని, ఫిర్యాదు చేయాలని సూచించారు. సాక్ష్యాధారాలతో కేసును సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.



# మెదక్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించిన ఆర్డీవో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వేదిక, పరేడ్ నిర్వహణ, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని, కార్యక్రమం సజావుగా జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ నవీన్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత పోలీస్ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: రైతులు ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించేలా వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో జిల్లాలో ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉండే వరి సాగుపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాలు తగ్గిన పరిస్థితుల్లో వరి పంటకు అవసరమైన నీరు అందక పంటలు ఎండిపోయే అవకాశం ఉందని, తద్వారా దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులు, గ్రామ సర్పంచులకు పరిస్థితులను వివరించి తక్కువ నీటితో సాగు చేయగల పంటలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తూ పంటల ఎంపికలో తగిన మార్గదర్శకత్వం ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్‌తో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్‌లో ఘనంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం

మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: భారతీయ జనతా పార్టీ జాతీయ, రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు వికసిత్ భారత్ లక్ష్యంగా మెదక్ జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, ప్రాంతాలు, మతాలు, కులాలకు అతీతంగా ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. జాతీయ జెండాలతో నిర్వహించిన కార్యక్రమంతో మెదక్ జిల్లా కేంద్రంలో దేశభక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చిన్మనైన శ్రీనివాస్, ఈర్ల రంజిత్ రెడ్డి, నిజాంపేట మాజీ జెడ్పీటీసీ పంజాబీ చెయ్, హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ శంకర్ గౌడ్, బీజేవైఎం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయని ప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కాశీనాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు వెల్మకొండ రాజేందర్, కార్యదర్శి సాధు అశోక్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, బట్ల జనార్ధన్, పట్లోళ్ల మల్లిక, జ్ఞానసింగ్, హర్ ఘర్ తిరంగా కో-కన్వీనర్లు రాజేశ్వరి, సాయి సన్నీ, మెదక్ కౌన్సిలర్లు అఖిల, భారత్, పప్పా, రాజమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల బీజేపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్ రిహార్సల్‌ను సమీక్షించిన అదనపు ఎస్పీ






మెదక్ | సందేశం టైమ్స్ ప్రతినిధి మన్నె పోచయ్య | ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న పరేడ్ ఏర్పాట్లను జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్ సమీక్షించారు. పరేడ్ రిహార్సల్‌ను పరిశీలించిన ఆయన పోలీస్ సిబ్బంది కమాండ్లకు అనుగుణంగా చేస్తున్న కవాతు కదలికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పరేడ్‌లో పాల్గొనే ప్రతి ఒక్కరూ పూర్తి ఉత్సాహంతో, క్రమశిక్షణతో పాల్గొనాలని సూచించారు. కవాతులో అడుగులు, మలుపులు, కమాండ్లకు అనుగుణంగా కదలికలు ఒకే విధంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పరేడ్‌లో పాల్గొనే సిబ్బంది టర్న్‌అవుట్ ఆకట్టుకునేలా ఉండాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు ఎస్పీ ఆదేశించారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు సంగారెడ్డిలో పటిష్ట బందోబస్తు






సంగారెడ్డి | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సుమారు 1,500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రతా ఏర్పాట్లపై జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎస్పీ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అలసత్వానికి తావివ్వకూడదని సూచించారు. అనంతరం అదనపు ఎస్పీ చైతన్యరెడ్డి ఐపీఎస్‌తో కలిసి హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, పార్కింగ్ ప్రాంతాలు, గంజీ మైదాన్, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, హాస్టల్ గడ్డ, తారా కళాశాల, సీఎస్ఐ చర్చి, ఐబీ చౌరస్తా తదితర ప్రాంతాలతో పాటు సభా స్థలమైన అంబేద్కర్ స్టేడియంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, వీఐపీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవల నిర్వహణపై సంబంధిత అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహిస్తూ భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి సభకు వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చే బస్సులు, వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను కేటాయించారు. ఆందోల్ నియోజకవర్గం నుంచి వచ్చే బస్సులకు గంజీ మైదాన్, నారాయణఖేడ్, జిన్నారం, హత్నూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు ప్రభుత్వ మెడికల్ కళాశాల, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల నుంచి వచ్చే బస్సులకు హాస్టల్ గడ్డ ఈద్గా, పటాన్‌చెరువు నియోజకవర్గం, ఇందిరేశం, ఈసనాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే బస్సులకు న్యూ బస్‌స్టాండ్‌లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. నాలుగు చక్రాల వాహనాలకు మహబూబ్ సాగర్ చెరువు కట్ట, ప్రభుత్వ బాలికల పాఠశాల, ద్విచక్ర వాహనాలకు ప్రభుత్వ బాలుర పాఠశాల, మీడియా వాహనాలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. సభకు వచ్చే వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులకు సహకరించాలని అధికారులు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు.



# పెళ్లికాని యువకులు మద్యం తాగితే రూ.5 వేల జరిమానా

తమిళనాడు | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: యువత భవిష్యత్, గ్రామ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తమిళనాడులోని విలుండమావడి గ్రామ మత్స్యకార సంఘం పెద్దలు మద్యపానంపై వినూత్న నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో పెళ్లికాని యువకులు మద్యం సేవిస్తూ పట్టుబడితే రూ.5 వేల జరిమానా విధించనున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా మద్యం సేవిస్తున్న యువకుల సమాచారాన్ని సంఘం పెద్దలకు అందించిన వారికి రూ.2 వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, భవిష్యత్ లక్ష్యాలపై దృష్టి సారించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంఘం పెద్దలు వెల్లడించారు. పెళ్లైన పురుషులు మద్యం సేవించడంపై పూర్తిస్థాయి నిషేధం విధించలేదని, అయితే మద్యం సేవించి గ్రామంలో గొడవలు, అశాంతికి కారణమైతే రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. గ్రామంలో క్రమశిక్షణ, శాంతియుత వాతావరణాన్ని కొనసాగించడమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశమని మత్స్యకార సంఘం పెద్దలు తెలిపారు.




# తెలంగాణలో 36,353 పోలింగ్ కేంద్రాలు ఖరారు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: తెలంగాణలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 36,353 పోలింగ్ కేంద్రాలు అధికారికంగా ఖరారయ్యాయి. ఓటర్ల సంఖ్యను సమతుల్యం చేయడం, పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీని తగ్గించడం, ఓటర్లు తమ నివాస ప్రాంతాలకు సమీపంలోనే ఓటు వేసే అవకాశం కల్పించాలనే లక్ష్యంతో పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 368 పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. జిల్లాల వారీగా హైదరాబాద్‌లో అత్యధికంగా 4,094 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ములుగు జిల్లాలో అత్యల్పంగా 308 కేంద్రాలు ఖరారయ్యాయి. కొత్త పోలింగ్ కేంద్రాలకు అనుగుణంగా బూత్ లెవల్ అధికారుల సర్దుబాటు, ఓటర్ల జాబితా నవీకరణ తదితర ప్రక్రియలను అధికారులు వేగవంతం చేస్తున్నారు.




# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 25 ఏళ్ల జైలు

మిర్యాలగూడ | సందేశం టైమ్స్ ప్రతినిధి | ఆగస్టు 14: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి నల్లగొండ జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం మొత్తం 25 ఏళ్ల కారాగార శిక్ష విధించింది. పోలీసుల వివరాల ప్రకారం 2020 మే 30న మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు సామాజిక మాధ్యమాల ద్వారా మైనర్ బాలికతో పరిచయం పెంచుకుని, అనంతరం ఆమెను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడినట్లు కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అవసరమైన సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో సమర్పించారు. కిడ్నాప్ నేరానికి ఐదేళ్ల కారాగార శిక్షతో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్ 3, 4 కింద 20 ఏళ్ల కారాగార శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. బాధిత మైనర్ బాలికకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని కూడా న్యాయస్థానం ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించగా, సమర్పించిన సాక్ష్యాధారాలు, వాదనలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష విధించింది. ఈ కేసును అప్పటి మిర్యాలగూడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ డి. శ్రీనివాస్ రెడ్డి దర్యాప్తు చేశారు. నల్లగొండ జిల్లా పోక్సో న్యాయమూర్తి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్ రావు తీర్పు వెలువరించారు.

# కోదాడలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన ప్రాంతం.. చర్యలు తీసుకోవాలి



కోదాడ | సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి | ఆగస్టు 14: కోదాడ పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన ప్రాంతానికి సమీపంలో ఉన్న ఓ ప్రాంతం సాయంత్రం వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు, మత్తు పదార్థాల వినియోగానికి అడ్డాగా మారుతోందని స్థానిక ప్రజలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతానికి సమీపంలో శ్రీవిద్య కళాశాల, సురేష్ ఆర్థోపెడిక్ ఆసుపత్రి, అయాన్ చిన్నపిల్లల ఆసుపత్రి, శ్రీ వైష్ణవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, భార్గవ్ డెంటల్ ఆసుపత్రి, శ్రీనివాస సినిమా హాల్, రైస్ మిల్లు తదితర విద్యా, వైద్య, వాణిజ్య సంస్థలు ఉన్నాయి. ప్రధాన రహదారికి సుమారు 100 మీటర్ల దూరంలోనే ఈ ప్రాంతం ఉండటంతో ప్రజల రాకపోకలు కూడా అధికంగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. అయితే సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో కొందరు పోకిరీలు, ఆకతాయిలు ఇక్కడ సంచరిస్తూ గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగానికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఈ సమస్యపై సామాజిక, రాజకీయ నాయకులు, స్థానికులు స్పందించడంతో పాటు సామాజిక మాధ్యమాలు, వార్తా కథనాల ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, పరిసర ప్రాంతాల ప్రజలు సాయంత్రం వేళల్లో ఈ ప్రాంతం గుండా వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటున్నారు. సంబంధిత పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో గస్తీ పెంచడంతో పాటు గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి ఈ ప్రాంత పరిస్థితిని పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని విద్యార్థులు, స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



## ఆషాఢ అమావాస్య సందర్భంగా ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలు

జోగిపేట — సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి వి. వెంకటేశం, ఆగస్టు 14: ఆషాఢ అమావాస్య సందర్భంగా జోగిపేట పట్టణంలోని ముత్యాలమ్మ (వజనాలమ్మ) అమ్మవారి ఆలయంలో విశేష పూజలు, ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించగా, పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఎం. మల్లికార్జున్ గుప్త, బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, బిర్ల శంకర్, యెర్ర సాయిలు, పుర ప్రముఖులు జూకంటి లక్ష్మణ్, రెడ్డిపల్లి బ్రహ్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, బంజ రవి, జలగరి యాదగిరి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కటుకం ప్రవీణ్ కుమార్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



## వీధి కుక్కల సంచారంతో భయాందోళనలో బాటసారులు, వాహనదారులు

పటాన్‌చెరు — సందేశం టైమ్స్ బి. డేవిడ్, ఆగస్టు 14: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సాయి కాలనీ, ఆర్‌కే నగర్ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతుండటంతో బాటసారులు, వాహనదారులు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ బైక్‌లు, సైకిళ్లపై వెళ్లేవారిని వెంబడిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. చిన్నారులను బయటకు పంపేందుకు, వృద్ధులు ఉదయం నడకకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి కుక్కల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించిన స్థానికులు, వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు, యాంటీ రేబిస్ టీకాలు అందించి ప్రజలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.






## శ్రావణమాసంలో బసవ మంటపంలో ప్రవచన కార్యక్రమాలు ప్రారంభం

జహీరాబాద్ — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 14: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ దత్తగిరి కాలనీలోని బసవ మంటపంలో రాష్ట్రీయ బసవదళ్, అక్కనాగలాంబిక మహిళా గణ ఆధ్వర్యంలో శ్రావణమాస ప్రవచన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలు ఆగస్టు 12 నుంచి సెప్టెంబర్ 11 వరకు 31 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు నిర్వహించనున్నారు. విశ్వగురు బసవేశ్వరుని సామూహిక ప్రార్థన, ధ్వజారోహణ అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి, గురుమాత నందాతాయి ధార్వాడ్ ఆధ్వర్యంలో మహా మానవతావాది జగజ్యోతి మహాత్మా బసవేశ్వరుని వచన సందేశాలపై ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షుడు కుష్నూర్ శంకర్ పాటిల్ తెలిపారు. ప్రతిరోజూ బసవదళ్ కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు న్యామతాబాద్ గ్రామానికి చెందిన బిరాదర్ అన్నపూర్ణ పాటిల్, అప్పారావు పాటిల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో రాష్ట్ర రాష్ట్రీయ బసవదళ్ ఉపాధ్యక్షుడు యశ్వంత్ రావు పాటిల్, జహీరాబాద్ టౌన్ అధ్యక్షుడు డా. శరణప్ప బలోడే, ఉపాధ్యక్షుడు సత్వార్ అన్వీర్, సురేష్ పాటిల్, మైకోడ్ నాగేష్, సంగమేశ్వర్ పాటిల్, అక్కనాగలాంబిక మహిళా గణ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఆగస్టు 15న సీఎం పర్యటనను అడ్డుకుంటాం: ఏబీవీపీ

సంగారెడ్డి — సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 14: సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాజు మాట్లాడుతూ తెలంగాణలో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సుమారు రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, సెమిస్టర్ పరీక్షలకు హాల్‌టికెట్లు పొందడంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆరోపించారు. గత మూడేళ్లలో ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు, తేలు కాటు కారణంగా 118 మంది చిన్నారులు మృతి చెందారని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని కోరుతూ, తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆగస్టు 15న సీఎం పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆందోళన సందర్భంగా పోలీసులు పలువురు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేయడంపై నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ధనరాజ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ సాయికృష్ణ, మనోహర్, సతీష్, లోకేష్, జగన్, కళ్యాణి, కీర్తన, నవనీత, పూజ, సంజన, శివమణి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగనివ్వం: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 14: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ఉప ప్రణాళిక నిధులను పక్కాగా వినియోగించాలని, నిధులను దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉప ప్రణాళిక నిధులు మిగిలితే వాటిని తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, ఈ విషయంలో అన్యాయం జరిగితే కమిషన్ ఊరుకోదని స్పష్టం చేశారు. ఎంపీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎన్డీఎఫ్ నిధులను నిబంధనల ప్రకారం కేటాయించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసులను న్యాయస్థానాల్లో జాప్యం లేకుండా పరిష్కరించి, శిక్షల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో తప్పనిసరిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ఎస్పీకి సూచించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ఎస్సైలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు హాజరై గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలపై దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి అవకాశాలను త్వరితగతిన కల్పించాలని అధికారులను కోరారు. భూభారతి ద్వారా ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలను పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ రూపొందించిన ప్రజెంటేషన్‌ను ఛైర్మన్ ప్రశంసిస్తూ కలెక్టర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రతి అంశంపై పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేశారని కొనియాడారు. అదేవిధంగా కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ నరసింహ సమర్థవంతంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, శంకర్, అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, ఎస్సీ డీడీ లతతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగనివ్వం: కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

సూర్యాపేట, ఆగస్టు 14 | సందేశం టైమ్స్ జిల్లా ప్రతినిధి సోమయ్య కంభంపాటి: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధితులకు అన్ని వేళలా అండగా ఉంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య స్పష్టం చేశారు. గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమిషన్ సభ్యులు, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహ, ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ఎస్సీ, ఎస్టీల భూముల సమస్యలు, దాడుల కేసులు, ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కోసం వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ఉప ప్రణాళిక నిధులను పక్కాగా వినియోగించాలని, నిధులను దారి మళ్లిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా నిధులు మిగిలితే వాటిని తిరిగి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించాలని సూచించారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీలకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని, అన్యాయం జరిగితే కమిషన్ ఊరుకోదని స్పష్టం చేశారు. ఎంపీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులు, ఎన్డీఎఫ్ నిధులను కూడా నిబంధనల ప్రకారం కేటాయించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులకు సంబంధించిన కేసులను జాప్యం లేకుండా పరిష్కరించి, శిక్షల శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు తప్పనిసరిగా బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా ప్రతి నెల చివరి వారంలో 'సివిల్ రైట్స్ డే' నిర్వహించాలని ఎస్పీకి సూచించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్సైలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై గ్రామస్థాయిలో ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి అవకాశాలను త్వరితగతిన కల్పించాలని కోరారు. 'భూభారతి' ద్వారా ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలను పరిష్కరించేందుకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ రూపొందించిన ప్రజెంటేషన్ విధానం అద్భుతంగా ఉందని బక్కి వెంకటయ్య ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ సమర్థవంతంగా పనిచేస్తున్నారని, ప్రతి అంశంపై పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేశారని కొనియాడారు. అదేవిధంగా కేసుల పరిష్కారం, శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్పీ నరసింహ వినూత్నంగా ముందుకు సాగుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, శంకర్, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, ఎస్సీ డీడీ లత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సూర్యాపేట గిరిజన గురుకులాల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 14: సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ ఆదేశాల మేరకు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో వివిధ సబ్జెక్టుల్లో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయాధికారి తెలిపారు. కంప్యూటర్ సైన్స్, కామర్స్, జువాలజీ తదితర సబ్జెక్టుల్లో డిగ్రీ లెక్చరర్ పోస్టులు 3, తెలుగు, ఇంగ్లిష్, ఫిజిక్స్, ఎకనామిక్స్, సివిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ తదితర సబ్జెక్టుల్లో జూనియర్ లెక్చరర్ పోస్టులు 9, హిందీ, తెలుగు, గణితశాస్త్రం, ఫిజిక్స్ సబ్జెక్టుల్లో పీజీటీ పోస్టులు 4, గణితశాస్త్రం, సైన్స్ సబ్జెక్టుల్లో టీజీటీ పోస్టులు 3 చొప్పున ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ప్రాంతీయ సమన్వయాధికారి, నల్లగొండ కార్యాలయం నుంచి దరఖాస్తు ఫారం పొంది, అర్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో ఈ నెల 14 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు జిల్లా మహిళా సమైక్య భవనం, డీటీసీ సమీపంలోని ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులకు డెమో, ఇంటర్వ్యూలు ఈ నెల 25న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యాపేటలోని టీజీటీడబ్ల్యూఆర్డీసీ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. టీజీటీ, పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పీజీ, డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు, బీఈడీలో 50 శాతం మార్కులతో పాటు టెట్ పార్ట్-2లో ఉత్తీర్ణత ఉండాలని, జూనియర్ లెక్చరర్ పోస్టులకు పీజీ, డిగ్రీలో కనీసం 55 శాతం, బీఈడీలో 55 శాతం మార్కులతో పాటు టెట్ పార్ట్-2లో ఉత్తీర్ణత ఉండాలని పేర్కొన్నారు. డిగ్రీ లెక్చరర్ పోస్టులకు పీజీ, డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ, నెట్ లేదా సెట్ అర్హత ఉండాలని తెలిపారు. ఒకే సబ్జెక్టులో ఇద్దరు అభ్యర్థులకు సమాన మార్కులు వచ్చినట్లయితే గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. బాలికల పాఠశాలలు, కళాశాలల్లో మహిళా అభ్యర్థులు, బాలుర పాఠశాలలు, కళాశాలల్లో పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను ప్రాంతీయ సమన్వయాధికారి కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచి, మెరిట్ ఆధారంగా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులను మాత్రమే డెమో, ఇంటర్వ్యూకు అనుమతిస్తామని తెలిపారు. ఖాళీల సంఖ్య పెరగవచ్చు లేదా తగ్గవచ్చని అధికారులు స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 8333925379 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.



# విద్య, వైద్యం సహా సామాజిక సేవల్లో పీపీపీ విధానానికి శ్రీకారం

కోదాడ, ఆగస్టు 14 | సందేశం టైమ్స్ ప్రతినిధి కె. సురేష్ రాజ్: విద్య, వైద్యం, తాగునీరు, రవాణా వంటి సామాజిక రంగాల్లో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం 'పీపీపీ విధానం–2026'కు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఈ విధానం ప్రకారం సామాజిక రంగానికి సంబంధించిన పలు ప్రాజెక్టులను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టే అవకాశం ఉండగా, కొన్ని సేవలకు వినియోగదారుల నుంచి రుసుములు వసూలు చేసే విధానం అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ సంస్థలకు వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్), వడ్డీ లేని రుణాలు వంటి ప్రోత్సాహకాలు అందించే ప్రతిపాదనలు ఉన్నట్లు సమాచారం. వైద్య కళాశాలల ఏర్పాటుకు వీజీఎఫ్‌తో పాటు రాయితీపై భూమి కేటాయించే అవకాశం ఉందని, ఆయా ప్రాజెక్టుల్లో ప్రైవేట్ సంస్థలకు 51 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ఉండే విధంగా విధానాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. సామాజిక రంగ సేవల్లో ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం వల్ల ప్రజలకు సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వినియోగదారులపై పడే ఆర్థిక భారం, సేవల నాణ్యత, ప్రభుత్వ నియంత్రణ వంటి అంశాలపై స్పష్టత అవసరం.

# ఓటర్ల జాబితాలో భారీ మార్పులు.. తుది గణాంకాలపై ఉత్కంఠ

కోదాడ, ఆగస్టు 14 | సందేశం టైమ్స్ ప్రతినిధి కె. సురేష్ రాజ్: బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల దరఖాస్తు గడువు ముగిసినట్లు సమాచారం. ఈ ప్రక్రియలో 60,69,065 మంది ఓటర్ల వివరాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3.38 కోట్ల నుంచి 2.64 కోట్లకు తగ్గే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది. మొత్తంగా సుమారు 73 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితి ఏర్పడిందన్న సమాచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే తుది గణాంకాలు వెలువడే వరకు తొలగింపులపై ఖచ్చితమైన సంఖ్యను నిర్ధారించలేమని అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. తుది ఓటర్ల జాబితా, తొలగింపులకు గల కారణాలను ఎన్నికల అధికారులు వెల్లడించిన తర్వాతే పూర్తి వివరాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# బాధితులనే నిందితులుగా చిత్రీకరిస్తున్నారు: వైఎస్ జగన్ విరూపాక్షి అరెస్టుపై ప్రభుత్వ తీరును ప్రశ్నించిన మాజీ సీఎం

ఆంధ్రప్రదేశ్, ఆగస్టు 14 | సందేశం టైమ్స్ ప్రతినిధి: ఎమ్మెల్యే విరూపాక్షిపై నమోదైన కేసు, ఆయన అరెస్టు విషయంలో ప్రభుత్వం, పోలీసుల తీరుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కుట్ర రాజకీయాలు పరాకాష్టకు చేరాయని, బీసీ నాయకులను సైతం రాజకీయ కక్షలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతోనే విరూపాక్షిపై అక్రమ కేసులు నమోదు చేశారని విమర్శించిన ఆయన, అర్ధరాత్రి 2.45 గంటలకు ఎమ్మెల్యేను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? పగటి సమయంలో నోటీసు ఇచ్చి విచారణకు పిలవవచ్చుకదా అని అన్నారు. విరూపాక్షి ఇంట్లో పోలీసులు సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంపై కూడా జగన్ ప్రశ్నలు సంధించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి తిరిగి వారిపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. నిజానిజాలు పూర్తిగా తెలుసుకోకుండా పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే విరూపాక్షిపై నమోదైన కేసుల విషయంలో పోలీసులు చేసిన తప్పులకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. జైలులో విరూపాక్షితో ములాఖత్ సందర్భంగా తనను నిలబెట్టి వీడియోలు చిత్రీకరించడాన్ని కూడా జగన్ ప్రస్తావించారు. ఈ విషయంపై జైలు సూపరింటెండెంట్‌ను ప్రశ్నించగా 'పై నుంచి ఆదేశాలు' ఉన్నాయని చెప్పారని పేర్కొన్నారు. తనను ఉద్దేశపూర్వకంగా అవమానించేందుకే ఈ చర్యలు చేపట్టారని, చంద్రబాబు శాడిజం పరాకాష్టకు చేరిందని జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు వేస్తున్న రాజకీయ విషబీజాలు భవిష్యత్తులో రెట్టింపు ప్రభావంతో తిరిగి వస్తాయని ఆయన హెచ్చరించారు.

# బిహార్‌లో ఫేక్ ఐఏఎస్ అధికారిపై కేసు.. భారీగా ఆస్తుల గుర్తింపు

బిహార్, ఆగస్టు 14 | సందేశం టైమ్స్ ప్రతినిధి కె. సురేష్ రాజ్: బిహార్‌లో ఐఏఎస్ అధికారినంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తాను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ అండర్‌కవర్ ఏజెంట్‌నంటూ పలువురిని నమ్మిస్తూ వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడి నుంచి ఖరీదైన టెస్లా కారు, పలు గుర్తింపు కార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అతడు వివిధ మార్గాల్లో సుమారు రూ.100 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. నిందితుడు ఉపయోగించిన గుర్తింపు కార్డులు, ఆస్తుల వివరాలు, మోసాలకు సంబంధించిన వ్యవహారాలపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.